క్లుప్తంగా

ఉపాధిహామీ డబ్బులు చెల్లించాలి



ఆందోళన చేస్తున్న కూలీలు

తాంసి: ఉపాధిహామీ పనులకు సంబంధించిన కూలి డబ్బులను చెల్లించాలని మహిళా కూలీలు ఆందోళన చేపట్టారు. మండలంలోని జామిడి గ్రామానికి చెందిన పలువురు కూలీలు సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. పనులు చేస్తున్నా.. డబ్బులు రావడం లేదన్నారు. వెంటనే డబ్బులు చెల్లించాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. గత నెల రోజులుగా పనులు చేస్తున్నా.. కూలీ డబ్బులు రావడం లేదన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

ఆదిలాబాద్‌టౌన్: కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడం పట్ల తెలంగాణ ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమానికి సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణతో పాటు పలువురు సంఘ బాధ్యులు హాజరయ్యారు. సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని, ఆయనకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, వైద్య శాఖ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

జొన్న పంట కొనుగోలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తాంసి: రైతులు పండించిన జొన్న పంటను వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి డిప్యూటీ తహసీల్దార్‌కు విష్ణుకు వినతిపత్రం అందజేశారు. యాసంగి సీజన్‌లో సాగుచేసిన జొన్నపంట వర్షాల దెబ్బతిని నల్లగా మారిందన్నారు. ఎకరానికి 15 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి, సుభాష్, విలాస్, నర్సారెడ్డి, విఠల్ పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన జెడ్పీ చైర్మన్

ఆదిలాబాద్‌అర్బన్: మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌ను ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ సోమవారం కలిశారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి వచ్చిన మంత్రిని జెడ్పీ చైర్మన్ కలిశారు. జిల్లాలోని అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు గురించి చర్చించారు.

మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసిన మాజీ ఎంపీ

ఆదిలాబాద్‌అర్బన్: రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను మాజీ ఎంపీ గోడం నగేశ్ సోమవారం హైదరాబాద్‌లోని నూతన సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆదర్శ క్రీడా పాఠశాలలను ఇంటర్మీడియేట్ వరకు ఉన్నతీకరించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మార్క్‌ఫెడ్ అసిస్టెంట్ డీఎంవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో అదనంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న కోరారు. బోథ్ మండలం కనుగుట్ట గ్రామ రైతులతో కలిసి సోమవారం జిల్లా కేంద్రంలోని మార్క్‌ఫెడ్ అసిస్టెంట్ డీఎంవో ప్రేమ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనుగుట్ట గ్రామ పరిధిలోని బోథ్ శివారు, కిష్టాపూర్ శివారులో 1500 ఎకరాల్లో మొక్కజొన్న పండిస్తే దాదాపుగా 30 వేల క్వింటాళ్ల నుంచి 35 వేల క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందన్నారు. కొనుగోలు కేంద్రం లేక కనుగుట్ట గ్రామం నుంచి మక్కలను వాహనాల ద్వారా తీసుకురావడంతో అదనపు భారం పడుతుందన్నారు. కనుగుట్ట గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జేడీఏ పుల్లయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులు వెంకట రమణ, రామకృష్ణ, గంగయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

పూడికతీత ప్రారంభించేదెప్పుడో?



వడ్డాడి చెరువులో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- చెరువుల్లో నిండిన పూడిక
- చేలలో వేసుకునేందుకు రైతుల ఎదురుచూపు
- ఉపాధిహామీ కింద ప్రారంభం కాని పనులు
- పట్టించుకోని అధికారులు

తాంసి: ఉపాధిహామీ పనుల్లో భాగంగా ఆయా గ్రామాల్లోని చెరువుల్లో ప్రతీఏటా పూడికతీత పనులు చేపట్టేవారు. ఉపాధి కూలీల ద్వారా పనులు చేపట్టి చెరువుల్లో పూడిక తీసేవారు. చెరువు మట్టిని రైతులు చేలల్లో వేసుకునే వారు. దీంతో నేల సారవంతమయ్యేది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో ఈఏడాది వేసవికాలంలో గ్రామాల్లోని చెరువుల్లో పూడికతీత పనులు ఇప్పటికీ చేపట్టలేదు. దీంతోరైతులు చేలల్లో మట్టి వేసుకునేందుకు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పూడికమట్టి తరలింపు పనులు ప్రారంభించాల్సి ఉండగా.. ఆదిశగా చర్యలు తీసుకోవడం లేదు. అధికారుల నుంచి సరైన స్పందన లేక పోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

రైతులపై ఆర్థిక భారం..

చెరువులోని పూడికమట్టిని పంటచేలకు తరలించడానికి రైతులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటి వరకు ఉపాధి పనుల్లో భాగంగా చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు. ఒకొక్క ట్రాక్టర్ మట్టిని తరలించడానికి రూ.500 నుంచి రూ.700 వరకు చెల్లిస్తున్నారు. చెరువుల్లో జేసీబీ ద్వారా తవ్వుకుంటూ పంటచేలకు తీసుకెళ్తున్నారు. దీంతో రైతులకు పూడికమట్టిని తరలించడం ఆర్థిక భారం అవుతోంది. ఉపాధి పనుల ద్వారా పూడికతీత చేపడితే కేవలం ట్రాక్టర్ ఖర్చులు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.

పూడికతీత చేపట్టాలి



చెరువులోని పూడికతీత పనులు చేపట్టాలి. చేలలో మట్టి వేయడం ద్వారా పంట దిగుబడి పెరుగుతోంది. పూడికమట్టి ఉపాధి కూలీల ద్వారా తీస్తే పంటచేలకు తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నాం. వెంటనే అధికారులు కూలీలతో పూడికతీత పనులు చేపట్టాలి.
– పడాల రాములు, కప్పర్ల, రైతు

పనులు ప్రారంభిస్తాం



ఉపాధిహామీ పథకం కింద చేపట్టే పనుల్లో భాగంగా చెరువుల్లో పూడికతీత పనులను త్వరగా ప్రారంభిస్తాం. ప్రతీ గ్రామంలో రైతులు పూడికమట్టిని తీసుకెళ్లడానికి ముందుకువస్తే పనులు చేపడుతాం. నీటిపారుదల శాఖ అ ధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.
– విజయ, ఉపాధిహామీ ఏపీవో

పూడికతీతకు అనుకూల సమయం

మండలం వ్యాప్తంగా మొత్తం 18 చెరువులున్నాయి. గతేడాది కురిసిన భారీ వర్షాలకు చెరువులు నీటితో పాటు పెద్దఎత్తున పూడికమట్టితో నిండాయి. ఈఏడాది మండలంలోని పొన్నారి గ్రామంలోని చెరువుల్లో తప్పా.. ఇప్పటివరకు ఏ గ్రామంలోని పూడికతీత పనులు చేపట్టలేదు. మిగతా గ్రామాల్లోని చెరువుల్లో పనులు చేపడితే పూడిక మట్టిని తరలించుకోవడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుతం చెరువుల్లో నీరు నిల్వ లేకపోవడంతో పూడికమట్టిని సులభంగా తరలించవచ్చు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున మట్టిని తీసే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధిహామీ పథకంలో భాగంగా చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

ఘనంగా ఎల్లమ్మ కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ సాయినగర్‌లో గల రేణుకా మాత (ఎల్లమ్మ) ఆలయ 13వ వార్షికోత్సవం పురస్కరించుకొని సోమవారం ఆదిలాబాద్ గీతా కార్మిక సంఘం ఆధ్వర్యంలో రేణుకా మాత కల్యాణం నిర్వహించారు. అమ్మ కటాక్షం ఉంటే సుఖశాంతులు, పాడి పంటలు సమృద్ధిగా పండుతాయన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు శంకర్ గౌడ్, అధ్యక్షుడు నర్సాగౌడ్, ప్రధాన కార్యదర్శి నాందేవ్ గౌడ్, దేవేందర్ గౌడ్, నరేశ్‌గౌడ్, సంజీవ్‌గౌడ్, కృష్ణగౌడ్, కిషన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో 54 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు చేసి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోభాబాయి, ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరాంనాయక్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, స్వర్ణలత, గిత్తే ఆశాబాయి, నాయకులు పాల్గొన్నారు.

ప్రతీవార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



రోడ్డు పనులు పరిశీలిస్తున్న జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: పట్టణంలోని అన్నివార్డులను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని 29వ వార్డు పరిధిలోని క్రాంతినగర్‌లో రూ.30 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీరోడ్డు, డ్రెయినేజీ పనులను పర్యవేక్షించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణప్రగతి ద్వారా స్థానికంగా నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పోటే శోభాబాయి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు అమ్మకంలో దళారుల చేతిలో మోసపోకుండా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించిన గిట్టుబాటు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరాంనాయక్, మహ్మద్ అంజద్, వైస్ ఎంపీపీ పడ్వాల్ గోపాల్‌సింగ్, జాదవ్ స్వర్ణలత, కోవ రాజేశ్వర్, గిత్తే ఆశబాయి పాల్గొన్నారు.

రైల్వే అండర్‌బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే జోగు రామన్న



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: రైల్వే అండర్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఇటీవల ప్రారంభమైన నేపథ్యంలో సోమవారం తాంసి బస్టాండ్ వద్ద గల రైల్వేట్రాక్ పరిసరాలను పరిశీలించారు. రైల్వే, మున్సిపల్ ఇంజనీర్ అధికారులతో చర్చించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలంలో ఎక్కువ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని, వానలు తగ్గుముఖం పట్టిన తర్వాత పనులు వేగవంతం చేయాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, ఆర్డీవో రమేశ్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

సర్వతోముఖాభివృద్ధికి క్రీడల దోహదం

ఆదిలాబాద్: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి క్రీడలు దోహదం చేస్తాయని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఓక్లే ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలను సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి రోజుల్లో విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేలా ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఎంపీపీ మారిశెట్టి గోవర్ధన్, ఓక్లే పాఠశాల నిర్వాహకులు గీత, సాయిని రవి కుమార్, స్విమ్మింగ్ కోచ్ క్రిష్ణ పాల్గొన్నారు.

15 నుంచి క్రీడా పోటీలు



మాట్లాడుతున్న ఎంపీపీ సజన్, జెడ్పీటీసీ అనిల్ జాదవ్

నేరడిగొండ: ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తుందని ఎంపీపీ రాథోడ్ సజన్, జెడ్పీటీసీ అనిల్ జాదవ్‌లు అన్నారు. సోమవారం ఎంపీపీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఈనెల 15 నుంచి 17వరకు మండలస్థాయిలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హ్యాండ్ బాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల యువత పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

తాంసి: మండల కేంద్రంలో ఈనెల 15 నుంచి మండలస్థాయి సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భూమయ్య తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 13న సాయంత్రం 5 గంటల లోపు మండల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఇచ్చోడ: ఈనెల 15 నుంచి 18 వరకు నిర్వహించే సీఎం కప్ క్రీడాపోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మాట్లాడారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ కధం సుభద్ర, తహసీల్దార్ మోహన్‌సింగ్, ఎంపీడీవో రాం ప్రసాద్, ఎంపీవో రమేశ్ పాల్గొన్నారు.

నార్నూర్: క్రీడాపోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ కనక మోతుబాయి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని ఎంపీపీ ఛాంబర్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసక్తిగల యువతీ, యువకులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పోటీలను మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేయాలని ఎంపీడీవోను కోరారు. సమావేశంలో తహసీల్దార్ ఆర్కా మోతిరాం, ఎంపీడీవో రమేశ్, ఏఎస్సై గంగారెడ్డి, ప్రిన్సిపాల్ ఉపేందర్ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు హ్యాంద్రు డునాట్ జయంతిని పురస్కరించుకొని సోమవారం రెడ్‌క్రాస్ డే నిర్వహించారు. ఈసందర్భంగా రిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లో పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బాలశంకర్ కృష్ణ, ప్రశాంత్, శశికళ, దొంతుల ప్రవీణ్, అర్బాత్ ఖాన్, సిరాజ్, మసూద్ అహ్మద్, రాజు, గణేష్, అఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

వీవోఏల అర్ధనగ్న ప్రదర్శన



నిరసన తెలుపుతున్న వీవోఏలు

తాంసి: తమ సమస్యలను పరిష్కరించాలని వీవోఏలు చేపట్టిన సమ్మె సోమవారం 22వ రోజుకు చేరుకుంది. భీంపూర్ మండల కేంద్రంలో వీవోఏలు అర్ధనగ్న ప్రదర్శనతో తమ నిరసన తెలిపారు. గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వీవోఏలను వెంటనే సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, రూ.26 వేల వేతనం అందించాలని డిమాండ్ చేశారు.

ఇంద్రవెల్లి: సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ వీవోఏలు చేపట్టిన సమ్మె సోమవారం 22వ రోజుకు చేరింది. మండల అధ్యక్షుడు షేక్ ఫెరోజ్ మాట్లాడుతూ.. వీవోఏలుగా విధులు నిర్వహిస్తున్న తమను సెర్ప్ ఉద్యోగులకు గుర్తించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీవోఏలు కోట్నాక్ భారిక్‌రావ్, జుగ్నాక్ రాందాస్, జైపాల్, చంద్రకాంత్, రాజమణి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నేరడిగొండ: వీవోఏల సమస్యలు పరిష్కరించాలని జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్‌లకు తమ గోడును వెల్లబోసుకున్నారు.సోమవారం ఎంపీపీ కార్యాలయానికి చేరుకుని వారితో మాట్లాడారు. ఇన్ని రోజులు గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందించామని, సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

వీవోఏల నిరసన

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సమ్మె చేస్తున్న వీవోఏలకు సోమవారం మండల వీవో లీడర్లు మద్దతు తెలిపారు. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, రూ. 26 వేల వేతనం ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో శ్యామల, రంజన, దైవ శాలబాయి, బత్తుల సులోచన, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బీఆర్‌ఎస్‌కు సర్పంచు రాజీనామా

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దంతన్‌పల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ ముచ్చినేని భూమన్న బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. సోమవారం స్థానిక ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీలో సరైన గుర్తింపు లేకపోవడంతో ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాజేశ్వర్, ఆత్రం మారుపటేల్, కొడప భీంరావు, సిడాం జైతు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి

ఇచ్చోడ: తెలంగాణ యూనైటెడ్ క్రిస్టియన్ ఫాస్టర్స్ అసోసియన్ రాష్ట్ర అధ్యక్షుడు గోనె సాల్మన్ రాజుకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని యూనైటెడ్ క్రిస్టియన్ ఫాస్టర్స్ బోథ్ డివిజన్ అధ్యక్షుడు నెమియ్య అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గోనె సాల్మన్ రాజు గత కొన్ని సంవత్సరాలుగా క్రిస్టియన్‌ల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు.

రాజ్యాంగ పుస్తకాన్ని అందించాలి

తలమడుగు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగ పుస్తకాన్ని ప్రతిఒక్కరికీ ఉచితంగా అందించాలని డీఎస్పీ పార్టీ నాయకులు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ సంతోశ్‌కు వినతిపత్రం అందజేశారు. రాజ్యాంగం మీద ప్రజలకు అవగాహన ఉన్నప్పుడే రాజ్యాంగ ఫలాలు అందుతాయన్నారు. నాయకులు నవీన్ మహరాజ్, గంగన్న, ప్రేమేందర్, సాయికుమార్, సురేశ్, వినుకుమార్, సంజీవ్, సాయిరాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని యేంద గ్రామానికి చెందిన జాదవ్ మధుకర్ ఆదివారం కూలీ పనికోసం బోథ్ మండలం కిష్టాపూర్‌కు వెళ్లగా.. పిడుగు పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చవాన్ శ్రీనివాస్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట శేషరావు, నరేశ్, భరత్, రవీందర్, జీవన్ ఉన్నారు.

బీమాచెక్కు అందజేత

ఆదిలాబాద్‌అర్బన్: జైనథ్ మండలం కరంజి గ్రామానికి చెందిన కల్వల్‌వార్ గణపతి కుటుంబానికి కాంగ్రెస్ చేయూతనందించింది. ఇటీవల గణపతి మృతిచెందాడు. కాంగ్రెస్ సభ్యత్వం తీసుకొని ఉండడంతో పార్టీ నుంచి అందించే రూ.2 లక్షల బీమా చెక్కును టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత గణపతి కుటుంబసభ్యులకు సోమవారం అందజేశారు. గండ్రత్ ఆశన్న, కన్య ప్రభాకర్ రెడ్డి, గంగన్న, వినోద్, తదితరులు ఉన్నారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం

నేరడిగొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని చిన్నబుగ్గారం గ్రామంలో కంటివెలుగు శిబి రాన్ని ప్రారంభించారు. వైద్యులు కంటి పరీక్షలు చే సి, అవసరమైన వారికి కళ్లద్దాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ విలాస్, ఉత్తం, గణేశ్, వైద్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఉట్నూర్‌రూరల్: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్‌ఎస్ యువ నాయకులు బాధవత్ పూర్ణచందర్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని పెర్కగూడ, హనుమాన్‌నగర్ కాలనీల్లో పర్యటించారు. స్థానికంగా నెలకొన్న ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల వర్షాల కారణంగా దెబ్బతిన్న ఆత్రం మోహన్ ఇంటిని పరిశీలించారు. అధైర్యపడొద్దని భరోసా కల్పించారు. ఆయన వెంట బాబా చవాన్, సలాఉద్దీన్, సోహెల్, నరేశ్, శ్రీనివాస్, సతీశ్ ఉన్నారు.

సమస్య విని.. చార్జింగ్ పెట్టించి



సమస్య తెలుసుకుంటున్న అడిషనల్ కలెక్టర్




సీసీకి సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్

ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం అంకుశాపూర్‌కు చెందిన ఆత్రం కవితబాయి ఇద్దరు పిల్లలు ఇంద్రవెల్లి మండలం పాఠగూడలో బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో పాటుకాటుతో మృతిచెందారు. పిల్లలను కోల్పోయిన తనకు ఆర్థికసాయం అందించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషాకు విన్నవించింది. ఆయన ఈ విషయంపై ఐటీడీఏ అధికారులతో మాట్లాడి అధికారులు ఫోన్ చేస్తారని, స్పందించాలని బాధితురాలికి తెలియజేశారు. ఆసమయంలో ఆమె సెల్‌ఫోన్ చార్జింగ్ లేకపోవడంతో అదనపు కలెక్టర్ ఫోన్ తీసుకుని సీసీకి అందజేసి చార్జింగ్ పెట్టించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా



పరామర్శిస్తున్న భుక్యా జాన్సన్ నాయక్

ఇంద్రవెల్లి: బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ నాయకుడు భుక్యా జాన్సన్ నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని భీంనగర్‌ను సందర్శించి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కేంద్రే ఉద్ధవ్ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని గోండ్‌గూడ గ్రామానికి చేరుకొని, ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన జైస్వాల్ సంతోశ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఇర్షద్, ఫారుక్, మడావి భీంరావ్, తదితరులు పాల్గొన్నారు.